క్లుప్తంగా

రేపు మినీ జాబ్ మేళా

తుని: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధికారి ఎం.కొండలరావు బుధవారం తెలిపారు. పలు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు ఎస్ఎస్సీ, ఇంటర్, ఫార్మసీ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8న చేపట్టనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు కుప్పల నాగభూషణం కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ప్రత్తిపాడు: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకొని, శిక్షానంతరం సమాజంలో గౌరవప్రదంగా మనుగడ సాగించాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ కోరారు. స్థానిక సబ్ జైలు ఆవరణలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని, మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఖైదీల హక్కులను బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.మధుబాబు వివరించారు. అనంతరం ఖైదీలకు బిస్కెల్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎస్.బాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐగా శివప్రసాద్



పి.శివ ప్రసాద్

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సీఐగా పి.శివ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎక్సైజ్ సీఐగా పనిచేసిన ఎల్.చిరంజీవి అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీపై వెళ్లారు. నూతన ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్‌కు సిబ్బంది స్వాగతం పలికారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



జెడ్‌రాగంపేట ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. మండలంలోని జెడ్.రాగంపేటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం ఆర్వోప్లాంట్, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌కు నూతన పరికరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం జగ్గంపేటలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జ్యోతుల నెహ్రూ, సభ్యులుగా పాండ్రంగి రాంబాబు, బొడ్డేటి సుమన్, నకిరెడ్డి సూర్యవతి, మానేపల్లి బంగార్రాజు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, వైద్య సిబ్బంది ప్రణీత్, శంకర్, వర్మ, వినూష, శ్రావణ సంధ్య, మాధురి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని తాళ్లూరుకు చెందిన పక్కుర్తి వీరబాబు (53) గత నెల 30న కూలి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటికి వచ్చి స్నానం అనంతరం ఇంటి బయట మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. అదే సమయంలో పిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి కుమారుడు వీర వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

తుని: స్థానిక పాత బజారువీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో అయ్యప్పరాజు బుధవారం తెలిపారు. తొమ్మిది రోజుల పాటు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు.




తపోవనంలో నవరాత్ర పూర్వక మహాభిషేకం నిర్వహిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి



గోకవరంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబైన దేవీచౌక్ ఆలయం



ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మవారు



ఏలేశ్వరంలో పూజలందుకోనున్న దుర్గాదేవి అమ్మవారు

దసరా వచ్చిందయ్యా..

- నేటి నుంచి శరన్నవరాత్ర వేడుకలు
- సుందరంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- గ్రామాల్లో పండగ వాతావరణం



ఏలేశ్వరం లింగవరం కాలనీలో అమ్మవారి ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న సెట్టింగులు

ఏలేశ్వరం: గ్రామాల్లో దసరా పండగ సందడి నెలకొంది. శరన్నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయాల్లో గురువారం నుంచి ఈ నెల 12 వరకు దసరా వేడుకలు నిర్వహించనున్నారు. దుర్గమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని లింగంవరం కాలనీ, తోట వీధి, ఆర్టీసీ బస్టాండ్, నర్సీపట్నం రోడ్, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయాల వద్ద భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద అమ్మవారి భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కుంకుమపూజలతో పాటు రాత్రి వేళ్లల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల అనంతరం అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సెట్టింగులు

దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలో జేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో చేసిన సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రస్టు అధ్యర్యంలో ప్రతి ఏడాది లింగవరంకాలనీలోని ప్రధాన రహదారికి సమీపంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసే అమ్మవారి విగ్రహం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఏటా ఇక్కడ భారీఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు

ఉత్సవాలకు ముస్తాబైన దేవీచౌక్ ఆలయం

గోకవరం: సిరులు కురిపించే చల్లనితల్లి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి ఈ నెల 12 వరకూ జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక తాణాసెంటర్‌లో మూడుకూడళ్ల వద్ద 2002వ సంవత్సరంలో అక్టోబర్ 12న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మండపాన్ని నిర్మించారు. భక్తులు, గ్రామస్తులతో పాటు ఈ మార్గంలో ప్రయాణించే వారు అమ్మవారిని దర్శించుకునేవారు. వారి మొక్కులు తీరడంతో భక్తులకు నమ్మకం పెరిగి రోజురోజుకూ అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూ ఆలయం అభివృద్ధి చెందింది. దీంతో భక్తుల సహకారంతో రాజమహేంద్రవరంలో దేవీచౌక్ ఆలయాన్ని పోలినట్టు ఉండే ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని, ప్రతి రోజూ విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ఆరవల్లి సీతారామాచార్యులు, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీను శర్మ తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా స్వర్ణ కిరీటం

ఈ ఏడాది అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో రూ.21 లక్షలతో చేయించిన నవరత్న ఖచిత స్వర్ణ కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గతేడాది ఉత్సవాల్లో ఆయన అమ్మవారికి బంగారు కిరీటం చేయించాలని సంకల్పించారు. దీనిలో భక్తులను కూడా భాగస్వామ్యం చేయాలని పిలుపునివ్వడంతో భక్తులు రూ.7 లక్షలు అందజేయగా, శ్రీనివాస్‌రావు రూ.14 లక్షలు మొత్తం 21 లక్షల ఖర్చుతో కిరీటం చేయించారు. అలాగే 10 కాసులతో అమ్మవారికి మంగళసూత్రం చేయించారు.

దేవీచౌక్ కనకదుర్గాదేవి అలంకరణలు ఇలా..

దసరా ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం అమ్మవారు భువనేశ్వరీదేవి అలంకరణలో భక్తలకు దర్శనమివ్వనున్నారు. 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపురసుందరీదేవి, 7న చండీ మంగళగౌరీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న మహాసరస్వతీదేవి, 10న కనకదుర్గాదేవి, 11న మహిషాసురమర్ధినీదేవి, 12న శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

తుని రూరల్: మండలవ్యాప్తంగా గురువారం నుంచి నిర్వహించే శరన్నవరాత్ర మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఉత్సవాలను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభించనున్నారు. తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తామని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఎస్.అన్నవరం, డి.పోలవరం, తేటగుంట, చామవరం, కేఓ.మల్లవరం, హంసవరం, రాపాక, వి.కొత్తూరు, టి.తిమ్మాపురం, కొలిమేరు, ఎన్.సూరవరం తదితర గ్రామాల్లో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మహాలయ నవరాత్ర పూర్వక మహాభిషేకం నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేస్తున్నట్టు మహాస్వామి తెలిపారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

తొండంగి: దసరా ఉత్సవాలకు మండలంలోని దుర్గామాత ఆలయాలు ముస్తాబయ్యాయి. ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, శృంగవృక్షం బీసీ కాలనీ, రావికంపాడులో మహిషాసురమర్దిని ఆలయం, దానవాయిపేట, ఒంటిమామిడి, వేమవరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, తొండంగి, పైడికొండ, వేమవరం, పెరుమాళ్లపురం తదితర గ్రామాల్లో దసరా వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు దుర్గామాతకు ప్రత్యేక పూజలతో పాటు ఆధాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: దేశ మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యుడిగా, నిజాయితీకి మారుపేరుగా జీవించిన లాల్‌బహదూర్‌శాస్త్రిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధానిగా శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, మామిడి శ్రీను, సామంతుల గోపి, పరవాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి బుధవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకులు ఫణి శర్మ, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన స్వచ్ఛతా హి సేవ



రత్నగిరిపై మొక్క నాటుతున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, సిబ్బంది



తిరుమాలిలో డస్ట్‌బిన్లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



తునిలో కార్మికులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, కమిషనర్ వెంకట్రావు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రత్నగిరి, సత్యగిరులపై ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. హరిహరసదన్ సత్రం ఆవరణలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా దేవస్థానంలో సత్రాలు, ఘాట్ రోడ్ పరిసరాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిశుభ్రత (స్వచ్ఛత) పాటించడం ద్వారా పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. మండలంలోని తిరుమాలిలో బుధవారం ఆయన స్వచ్ఛత సంకల్పం సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. అనంతరం ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవ ఉత్సవాలు

తుని: పట్టణంలో నెల రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ ఉత్సవాలు సత్ఫలితాలను ఇచ్చాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య కార్మికులను కమిషనర్ వెంకట్రావుతో కలిసి సత్కరించారు. శానిటేషన్ అధికారుల పనితీరును ప్రశంసించారు. కౌన్సిలర్లు, మెప్మా, ఆఫీసు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ ముగింపు వేడుకలు నిర్వహించారు. బీజేపీ నేతలు పాల్గొని గాంధీజీ విగ్రహం, పరిసరాలను శుభ్రం చేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వూట వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు



కోటనందూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



ఏలేశ్వరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్ఫూర్తి ప్రదాత గాంధీజీ

- వాడవాడలా జాతిపిత జయంతి వేడుకలు
- ఘన నివాళులర్పించిన నాయకులు, అధికారులు



ప్రత్తిపాడులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు బుధవారం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పట్టణంలోని షిర్డీ నగర్‌లోని గాంధీనగర్‌లో గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పైల విజయ్ కుమార్, కోరాడప్రసాద్, వాగు బలరామ్, కోరాడ అప్పలస్వామి పాల్గొన్నారు. పట్టణంలో గాంధీ విగ్రహానికి వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు గొల్లపల్లి త్రిమూర్తులు, బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. యర్రవరంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు: మండలవ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ జంక్షన్ వద్ద గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ గాంధీ చిత్రపటానికి, పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి సర్పంచ్ గుడాల విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గండేపల్లి: మహాత్మా గాంధీ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్ రుత్తల లలిత ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ రామన్, ఏఓ చంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

కోటనందూరు: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం గాంధీజీ జయంతి నిర్వహించారు. స్థానిక నూకాలమ్మగుడి ప్రాంతంలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మగాంధీ పోరాట పటిమను, ఆయన అనుసరించిన శాంతి మార్గాన్ని కొనియాడారు. కార్యక్రమంలో వెలగా వెంకటకృష్ణాజీ, వెలగా రాజబాబు, బత్తుల వెంకన్నబాబు, వెలగ కృష్ణ, కొల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: గాంధీ జయంతిని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గాంధీ చిత్రపటానికి ఆస్పత్రి సిబ్బంది నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. తంటికొండలో గాంధీ విగ్రహానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), బద్దిరెడ్డి అప్పన్నదొర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుని: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో యువత పయనించాలని ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు. బుధవారం తుని పట్టణం గాంధీసత్రంలో గాంధీజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామకృష్ణుడు ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవదాయశాఖ సమకూర్చిన చీరలు, దుపట్లను పేదలకు పంపిణీ చేశారు. సత్రంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతసీడి అబ్బాయి పాల్గొన్నారు. పాత బజారు వీధి, బెల్లపువీధి ప్రాంతాల్లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

జగ్గంపేట: గాంధీజీ సిద్ధాంతాలను ప్రతిఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బూరుగుపూడిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మహాత్మగాంధీ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సిబ్బంది గాంధీ మహాత్ముడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



పి.భవాని



కేవీ సుబ్రహ్మణ్యం



కె.జయరాజు

జగ్గంపేట: రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పి.భవాని, కె.జయరాజు, వాలీబాల్ పోటీలకు కేవీ సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారని వివరించారు. వీరు ఈనెల 6న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

కుండపోత వాన



చిల్లంగిలో పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

ప్రత్తిపాడు/కిర్లంపూడి: రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. భీకరమైన శబ్దాలతో కూడిన ఉరుములకు ప్రజలు భయాందోళన చెందారు. రహదారులపై నీరు నిలిచిపోయింది. కిర్లంపూడి మండలం చిల్లంగిలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది.